సచివాలయ సేవలు భేష్

- పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లలో సిబ్బంది నిమగ్నం
- రాత్రి 10 గంటల వరకూ సేవలు అందజేత



గూనపాలెం సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయమని పలువురు కొనియాడుతున్నారు. రాత్రి 10గంటల వరకూ లబ్ధిదారులకు సేవలు అందిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. ప్రధానంగా నవరత్నాలు పథకాల్లో భాగంగా అర్హులైన పేదలకు అందించిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇటీవల చేపట్టింది. ఈ ప్రక్రియను సచివాలయ ఉద్యోగులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. శ్రీకాకుళం గూనపాలెంలోని 33వ వార్డులోని సచివాలయంలో సిబ్బంది అర్హులైన మహిళా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జోరుగా సాగిస్తున్నారు. కార్యాలయ పనివేళలు ముగిసినా లక్ష్య సాధనే ధ్యేయంగా రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో ఇళ్ల కోసం కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయిందని, ఇపుడు సీఎం జగనన్న ఏర్పాటు చేసిన సచివాలయం ద్వారా ఎక్కడికీ వెళ్లకుండానే నేరుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొంటున్నారు. గూనపాలెం వార్డుకు సంబంధించి 330 ఇళ్ల పట్టాలకు గాను 105 పట్టాల రిజిస్ట్రేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. కొన్ని సందర్భాలలో కంప్యూటర్ సర్వర్లు డౌన్ అవుతుండటం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొంత ఆలస్యం జరుగుతోందని, లేదంటే మరింత త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసేవారమని చెబుతున్నారు. కార్యక్రమంలో సచివాలయ రెవెన్యూ సెక్రటరీ ఎండీ ఇజాజ్‌ఖాన్, డిజిటల్ అసిస్టెంట్ వి.శ్రీనివాసరావు, అడ్మిన్ సెక్రటరీ బి.ఝాన్సీబాయి, తదితర సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాడి ఉత్పత్తులపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న గాయిత్రి

ఎచ్చెర్ల: పాడి రైతులు పశువుల పెంపకం, పాల ఉత్పత్తులపై అవగాహన కలిగి ఉండాలని పశు వైద్యాధికారిణి (వీఏఎస్) బి.గాయిత్రి సూచించారు. లావేరు మండలం ఇజ్జాడపాలెం గ్రామంలో పశువిజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా పాడి రైతులతో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడి రైతులు పశువుల సంరక్షణకు ఎటువంటి దాణాను అందించాలి, పాల దిగుబడిని పెంచేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ గొర్లె గోపాలకృష్ణ, స్థానిక సర్పంచ్ పిల్ల రాము ఉన్నారు.

గ్రంథాలయం సందర్శన



పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో కూడిన గ్రంథాలయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేశారు. దీన్ని ఎంపీడీవో కె.కృష్ణంరాజు, ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ రమ్యప్రియాంక

జి.సిగడాం: మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్యం సత్ఫలితాన్ని ఇస్తుందని డాక్టర్ లావేటి రమ్యప్రియాంక అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో దివ్యాంగు పిల్లలకు ఫిజియోథెరపీ సేవలను శుక్రవారం అందించారు. పిల్లలకు ఇంటి దగ్గర ఫిజియోథెరపీ అందిస్తే త్వరగా కోలుకుంటారన్నారు. ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు టి.కృష్ణ, సీహెచ్ మాధురి, కృష్ణవేణి ఉన్నారు.

ఘనంగా షిరిడిసాయి ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని షిరిడీసాయి బాబా తత్వ ప్రచార మందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఊరేగింపు నిర్వహించారు. మందిరం నుంచి పురవీధులలో షిరిడీసాయి విగ్రహాన్ని రథంపై ఉంచి ఊరేగింపుగా వెళ్తూ భక్తులు భజనలు చేశారు.అఖండ భజన, మూడు హారతులు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మందిర చైర్మన్ ముద్దాడ అప్పలనాయుడు, బోర సన్యాసిరావు, కోరాడ శ్రీనివాసరావు, వరదా సత్యన్నారాయణ, దంపాక రమణమూర్తి, ముద్దాడ పద్మావతి, భక్తులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



ఆవిర్భావ దినోత్సవంలో మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ–బీ కాలనిలో షిరిడీసాయి మందిర కమిటీ 32వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ అధ్యక్షుడు మధు విలేకర్ మాట్లాడుతూ కమిటీ సభ్యుల సహకారంతో ఎంతో ప్రగతి సాధించామన్నారు. మందిరంలోని యోగా హాల్లో రెండు పూటలా యోగా తరగతులూ నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం సాముహిక లలితా, విష్ణు సహస్ర పారాయణలు జరుగుతున్నాయని, ప్రతి గురువారం 800 మందికి అన్నదానం నిర్వహిస్తున్నామని వివరించారు. సాయిసదన్ పేరిట సామాజిక భవనం నిర్మాణం జరుగుతోందన్నారు. విరాళ దాతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు కొంక్యాన మురళీధర్, అంబటి రంగారావు, ఇప్పిలి భవానీ, ఓ.సాంబశివరావు, సంపతిరావు సత్యనారాయణ రాజు, వూన్న గుప్త, పూర్ణశశి, పైడి రాజ్యలక్ష్మీ, సత్యవతి, ఆలయ కమిటీ మేనేజర్ గోపాలకృష్ణ, సిబ్బంది నారాయణ, సత్యం, పాల్గొన్నారు.

పాదయాత్రకు ఎమ్మెల్యే సంఘీభావం



వెంకట రామారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: తమ సామాజికవర్గాన్ని బీసీల్లో చేర్చాలని కోరుతూ తెలగ సంక్షేమ సంఘ నాయకుడు పల్లంట వెంకట రామారావు (పీవీఆర్) చేపట్టిన పాదయాత్ర శుక్రవారం రణస్థలం చేరుకుంది. ఈ సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వారిని కలిసి సంఘీభావం తెలియజేశారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో పాదయాత్రగా విచ్చేసిన వెంకటరామారావుకు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలగ కులస్తుల్లో పేదవారు ఉన్నారన్నారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ కూడా పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, లావేరు, రణస్థలం మండలాల తెలగ కులస్తుల నాయకులు ఉన్నారు.

ఎచ్చెర్ల: వెంకట రామారావు చేపట్టిన పాదయాత్ర లావేరు మండలంలో కూడా కొనసాగింది. లావేరు కూడలి వద్ద ఉన్న వంగవీటి మోహనరంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లావేరు, బొడ్డపాడు, గురుగుబిల్లి, సుభద్రపురం, తాళ్లవలస, రావివలస గ్రామాల మీదుగా పాదయాత్ర చేపట్టారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్యాణి

గార: నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు అందించిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.కల్యాణి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అర్బన్ స్థలాలు, వాడాడ పంచాయతీ మినహా అన్ని సచివాలయాల పరిధిలో శనివారంలోగా రిజిస్ట్రేషన్లు ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్టు కార్డుల పంపిణీకి సంబంధించి వెల్ఫేర్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఓ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళాశాలకు సీసీ కెమెరాల వితరణ



సీసీ కెమెరాల సిస్టమ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

గార: కె.మత్స్యలేశంలోని కళింగపట్నం కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదే కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ఓల్డ్ బాయ్స్ అసోసియన్ పేరిట రూ.35 వేలు విలువైన సీసీ కెమెరాలను అందించారు. వీటిని గురు, శుక్రవారాల్లో కాలేజీ భవనాల్లో ఏర్పాటు చేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రత్యేక చొరవతో రూ.1.93 కోట్లు నిధులు విడదల చేయడంతో నిర్మాణాలు పూర్తయిన నూతన భవన సముదాయాన్ని ఇటీవలే ప్రారంభించారు. త్వరలో జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, కళాశాల గదులను పరిశీలించేందుకు వీలుగా ప్రిన్సిపాల్ చాంబర్‌లో సీసీ కెమెరాలను అనుసంధానిస్తూ సిస్టమ్ ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.అప్పలరాము, సర్పంచ్ బి.లలిత ఎర్రన్నలు అభినందించారు. కార్యక్రమంలో కెప్టెన్ ఎర్రన్న, వాసుపల్లి కృష్ణమూర్తి, హరిహర రెడ్డి పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. అంపోలులోని కేంద్ర కారాగారాన్ని శుక్రవారం సందర్శించి ఖైదీలతో మాట్లాడి వసతులపై ఆరాతీశారు. న్యాయ సహాయం, వైద్యసేవలపై ఆరాతీశారు. లాయర్లను పెట్టుకునే ఆర్థిక స్తోమత లేకపోతే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమించి కేసు నడిపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జైలర్ ఉదయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి పరామర్శ



సత్తిరాజును పరామర్శిస్తున్న అధికారులు, నాయకులు

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామ సచివాలయ క్రీడాకారులు 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో జిల్లా స్థాయిలో గెలుపొందారు. రాష్ట్రస్థాయి పోటీలకు విశాఖపట్నం వెళ్తుండగా క్రీడాకారుడు సత్తిరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తగరపువలస సమీపంలోని అనీల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్తిరాజును వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి శుక్రవారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శలో మండల పరిషత్ ఏవో ధనుంజయరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మంనాయుడు ఉన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయ శాఖ ద్వారా రబీ పంటకు సంబంధించి శుక్రవారం శ్రీకాకుళం రూరల్ మండల వ్యవసాయ కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి తరఫున అధికారులు పలు సలహాలు, సూచనలు జారీ చేశారు. రాగి, వేరుశనగ, మినుములు మంజూరు చేసేందుకు సలహా మండలి ఆమోదించింది. రబీ కాలానికి అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్ప దివ్య, పశువైద్యాధికారి డాక్టర్ దిలీప్, రైతులు పాల్గొన్నారు.

పొన్నాంలో భాగవత సప్తాహం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పొన్నాంలో కేశవస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం భాగవత సప్తాహం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పారాయణం, విశేష హోమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి వేద పండితులు హాజరయ్యారు. కార్యక్రమంలో మహీంద్రాడ నారాయణాచార్యులు, భాస్కరబట్ల శ్రీరామశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జామియా మసీదు కమిటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మసీదు పెద్దలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను శుక్రవారం శ్రీకాకుళం జామియా మసీదు కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మసీదు ఇమామ్, జిల్లా ఖా అబ్దుల్ వహాబ్ ప్రార్థన చేసి జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని అల్లాను ప్రార్థించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షుడు హాజి భయ్యా, కార్యదర్శి అక్బర్ బాషా, సహాయ కార్యదర్శి శుకుర్‌ఖాన్, ట్రెజరర్ ఉస్మాన్, సభ్యులు అబ్దుల్, డెంటల్ రఫీ, ఇర్ఫాన్ బాషా, షఫీ, మతాబ్ ఖాన్, కరీం, గౌరవ సలహాదారు హాజీ అమిరుల్లా బేగ్, ఫ్యామిలీ కౌన్సెలింగ్ సభ్యులు షేర్ అలీ బేగ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



ఉమామహేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: మండల తహసీల్దార్‌గా ఆర్.ఉమామహేశ్వరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పని చేసి..ఎన్నికల నేపథ్యంలో ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, గాయత్రి, ఆర్‌ఐ రామచంద్రరావు, వీఆర్వోలు, బీఎల్‌వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సక్రమంగా విధుల నిర్వహణ

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వరరావు తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సక్రమంగా పని చేయాలని సూచించారు. గ్రామ, మండలస్థాయి సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. బూత్‌లెవెల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డీటీలు నిర్మల, గాయత్రి, ఆర్‌ఐ రామచంద్రరావు, వీఆర్వోలు భూపతి నర్సింగరావు, పొట్నూరు జగన్, సీతయ్య, నీలకంఠం, ఎరకయ్య, సింహాచలం పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం



పి.వి.నరసింహారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై గుజరాతీపేట బ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం ఫాజుల్‌బాగ్‌పేటలో నిర్వహించిన సంఘ సమావేశంలో అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి మాట్లాడారు. బహుభాషా కోవిదుడు, దేశ అభివృద్ధి ప్రదాత నరసింహారావుకు అత్యున్నత పురస్కారం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. దేశం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో పీవీ చేపట్టిన నూతన ఆర్థిక, పారిశ్రామిక విదేశాంగ విధానాలు అగ్రదేశాలతో పోటీపడేలా చేశాయని గుర్తు చేశారు. ఈసందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దూసి నాగేశ్వరరావు, కస్తూరి సంతోష్‌కుమార్, పారనంది విజయకుమార్, తుమరాడ సంతోష్‌కుమార్, ఫణి కుమార్, గాయత్రి ప్రసాద్, తేజోమూర్తుల నాగరాజు పాల్గొన్నారు.

వెంకన్నకు జన్మనక్షత్ర పూజలు



వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యులు నేతృత్వంలో క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రధారణ, సాయంత్రం నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. అంతకు ముందు నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందడుగు వేయండి



కళాశాల ప్రతినిధులతో ఎస్పీ రాధిక, డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం న్యూకాలనీ: వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యం దిశగా విద్యార్థులు ముందుడగు వేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల రేజాయిస్ 2కే 2024 సక్సెస్‌మీట్‌ను శుక్రవారం నగరంలోని 80 ఫీట్ రోడ్‌లో ఉన్న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. డాక్టర్ దానేటి శ్రీధర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని సూచించారు.

అనంతరం ట్రిపుల్ ఐటీ, ఎంబీబీఎస్, బీడీఎస్, వెటర్నరీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినవారికి రూ.5వేలు చొప్పున 30 మందికి 1.50 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ ఎన్.దీపక్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, సీఏవో పి.రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లేశ్వరరావు, డిగ్రీ ప్రిన్సిపాళ్లు శివశంకర్, వేణుగోపాలరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా వ్యవసాయ ప్రణాళిక

- ఎంపీపీ చిరంజీవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయ ప్రణాళిక పక్కాగా అమలు కావాలని, ప్రభుత్వ పథకాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 15వ తేదీ లోపు రబీ ఈ–క్రాప్ నమోదు, రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలన్నారు. రబీలో ఆరుతడి పంటలపై రైతుల్లో అవగాహన కల్పించాలని, పశువులకు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా నారాయణపురం కుడికాలువ నీరు విడిచిపెట్టాలన్నారు. తోటపాలెం ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఏపీఎస్‌ఐడీసీకి ప్రతిపాదనలు పంపించాలని, విద్యుత్ లైన్ల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి రోజుకు తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఉద్యానవన ప్రోత్సాహంలో భాగంగా కొబ్బరి, జీడిమామిడి, మామిడి మొక్కలు పంపిణీ చేయాలని, పశు సంవర్థక శాఖ తరఫున పశువుల బీమా అమలు, సీజనల్ టీకాలు వేయటం, పశుగ్రాస విత్తనాల సరఫరా వంటి కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని తీర్మానించారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామ్మోహన్‌రావు, వ్యవసాయ అధికారి సురేష్, ఉపాధి హామీ పథకం ఏపీవో శోభాదేవి, వెట్నరీ అసిస్టెంట్ రమణ, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వరి, ఏఈవోలు దుర్గాప్రసాద్, రేవతి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకోట సూర్యారావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు శీరపు శ్రీరాంమూర్తి, అల్లు సూర్యనారాయణ, గవిరెడ్డి రవికుమార్, మారుపల్లి రాజు, టంపల శంకరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ రెండో డిపోలో ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం స్పందించాలని పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కె.బాబూరావు డిమాండ్ చేశారు. డిపో యాజమాన్య వైఖరికి నిరసనగా శుక్రవారం గ్యారేజీ ఆవరణలో పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు చర్చించినా పరిష్కారంలో చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినప్పటికీ డ్రైవర్, కండక్టర్ల చార్టులు వేయడం లేదని, సర్వీస్ ఎర్నింగ్ తగ్గిపోయాయని, బస్సులు చాలా వరకు రద్దు చేశారని, కేఎంపీఎల్‌పై వేధింపులు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

11 నుంచి సినిమా ఆడిషన్స్

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ సినీ హీరో రామ్‌చరణ్ సినిమాలో నటించేందుకు ఆసక్తి కలిగిన నటీనటుల కోసం ఈ నెల 11 నుంచి మూడు రోజులపాటు ఆడిషన్స్ నిర్వహించనున్నట్లు రామ్‌చరణ్ యువశక్తి జిల్లా అధ్యక్షుడు హరీష్ శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీకాకుళంలోని హోటల్ నాగావళిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆడిషన్స్ జరుగుతాయని, ఉత్తరాంధ్ర యాసలో నటన నిరూపించుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ



రణస్థలం: జె.ఆర్.పురం హైస్కూల్లో పిల్లలకు మాత్రలు వేస్తున్న సిబ్బంది



జి.సిగడాం: మోడల్ పాఠశాల చిన్నారులతో మాత్రలు మింగిస్తున్న అధికారులు

రణస్థలం: పిల్లలందరూ నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని ఎంఈవో ఎ.త్రినాథరావు అన్నారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురం హైస్కూల్లో పిల్లలకు ఆల్బెండ్‌జోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నుంచి 19 సంవత్సరాల లోపు విద్యార్థులందరూ ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని సూచించారు. ఏవో ధనుంజయరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జి.సిగడాం: చిన్నారులకు, విద్యార్థులకు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఆల్బెండ్‌జోల్ మాత్రలు వేయించాలని ఎంపీడీవో కె.కృష్ణంరాజు, వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ అన్నారు. స్థానిక కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు మందులను వేయాలన్నారు. ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, సూపర్‌వైజర్లు భాస్కరరావు, శేఖర్, ఏఎన్ఎం పద్మావతి, ఆశకార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి



లెక్చర్ ఇస్తున్న రవికుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: న్యాయ శాస్త్రం చదవుతున్న విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇంగ్లిష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రవికుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయశాస్త్రం విద్యార్థులకు శుక్రవారం వర్చువల్‌గా ఇంగ్లిష్ భాష ప్రాధాన్యత, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై వర్చువల్‌గా ప్రత్యేక గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. అక్కడి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధురీ పరదేశి పర్యవేక్షించారు. న్యాయ శాస్త్రం విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టుసాధించాలన్నారు. తప్పులు లేకుండా రాయటం నేర్చుకుంటే కార్పొరేట్ కంపెనీల న్యాయ సలహాదారులుగా, సివిల్ జడ్జిలుగా ఎంపిక అవుతారన్నారు.